క్లుప్తంగా

యోగి వేమన శతకం పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తదితరులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ టౌన్ మోడల్ హైస్కూల్, ఇందిరాగాంధీ మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌లో 6 వతరగతి విద్యార్థులకు మంగళవారం యోగి వేమన శతకం పుస్తకాలు పంపిణీ చేశారు. యోగి వేమన భావ ప్రచార సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రిన్సిపల్స్ ఎం.కృష్ణారెడ్డి, ఎం.డి వరప్రసాదు, ఆర్‌జీబీ రిటైర్డ్ మేనేజర్ ఎం.సి.వి రమణారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రంగ రవికుమార్, ఆర్.సత్యనారాయణ రెడ్డి, నారాయణ స్వామి(అడ్వకేటు), బి.మహేశ్వరరెడ్డి(అడ్వకేట్), కాటం శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం నగర అధ్యక్షుడిగా గాండ్ల లక్ష్మన్న



కర్నూలు కల్చరల్: బలిజ సంఘం నగర అధ్యక్షుడిగా గాండ్ల లక్ష్మన్న ఎన్నికయ్యారు. గతంలో నగర అధ్యక్షుడిగా ఉన్న గోపీనాథ్ వ్యక్తి గత కారణాలతో ఆ పదవి నుంచి తప్పుకోవడంతో మంగళవారం హెచ్‌డీటీసీ కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో బలిజ సంఘం పెద్దలు నూతన అధ్యక్షుడిని ప్రకటించారు. సమావేశంలో సంఘం నాయకులు పత్తి ఓబులయ్య, శోభన్‌బాబు, రవి, ఈశ్వర్, శైలేష్, అమర్నాథ్, ప్రేమ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడ్డు బలవర్ధక ఆహారం



మాట్లాడుతున్న డాక్టర్ బాలస్వామి

కర్నూలు (హాస్పిటల్) : అరచేతిలో ఇమిడేంత గుడ్డు రోజూ తినడం వల్ల సమృద్ధిగా ఆరోగ్యం లభిస్తుందని నెక్ జాతీయ అడ్వైజర్ డాక్టర్ కె.బాలస్వామి చెప్పారు. పోషకాహార మాసోత్సవాలను పురస్కరించుకుని అనంత ఎడ్యుకేషనల్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, నెక్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని టౌన్‌మోడల్ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.బాలస్వామి మాట్లాడుతూ మానవులు ఉపయోగించే 450 ఆహార పదార్థాల్లో తల్లి పాల తర్వాత గుడ్డు బలవర్ధక ఆహారమని చెప్పారు. ఆరు నెలల వయసు ఉన్న పిల్లలకు ఆహారంతో పాటు ప్రతిరోజూ గుడ్డు ఇవ్వవచ్చన్నారు. మహాత్మా గాంధీ సైతం గుడ్డును శాఖాహారంగా పేర్కొన్నట్లు తెలిపారు. డాక్టర్ మలిందర్‌స్వామి మాట్లాడుతూ ప్రతిరోజు గుడ్లను ఆహారంగా చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.సుంకన్న, రంగం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్ బాబు, అనంత ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

కర్నూలు (సెంట్రల్) : సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి పక్కా కమ్యూనిస్టు వాది అని, ఆయన హయాంలో సీపీఎం ఎంతో విస్తరించిందని వక్తలు కొనియాడారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు సీ.క్యాంప్‌లోని లలిత కళాసమితిలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య తదితరులు హాజరయ్యారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఏ గఫూర్ మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను నమ్మి రాజకీయాలు చేయడం ఏచూరికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.ప్రభాకర్‌రెడ్డి, పి.నిర్మల, డాక్టర్ శంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

సాక్షి, అమరావతి: కల్లుకుంటలో దళిత మహిళ సప్పాగు గోవిందమ్మను బలవంతంగా ఎత్తుకెళ్లి వివస్త్రను చేసి కరెంట్ స్తంభానికి కట్టేసి కొట్టిన ఆధిపత్య కులానికి చెందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజినేయ స్వామికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాము, జి.రామన్న, భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రసన్న కుమార్, అశోక్ తదితర ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందించింది. మొత్తం ఘటనపై విచారణ చేసి అసలు దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

మహా ఘన వీడ్కోలు !

- వైభవంగా 63 అడుగుల భారీ మట్టి వినాయకుడి నిమజ్జనోత్సవం
- భక్త జన సందోహం మధ్య ప్రతిష్టించిన చోటే నిర్వహణ
- పర్యావరణ హితానికి ప్రతీకగా నిలిచిన విఘ్నేశ్వరుడు


కర్నూలు కల్చరల్: భారీ మట్టి గణనాథుడికి మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం తుంగ భద్ర నది తీరంలో 63 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పర్యావరణ హితానికి ప్రతీకగా నిలిచేలా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వినాయక భక్త బృందం ప్రతిష్ఠించిన ఈ గణనాథునికి నిమజ్జనానికి ముందుగా పాలు, పసుపు, కుంకుమలతో అభిషేకం చేశారు. అనంతరం తుంగభద్ర నది నీటితో వేలాది మంది జన సందోహం మధ్య జలాభిషేకం చేశారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైరింజన్‌ల ద్వారా వినాయకుడిని నీటితో తడుపుతూ నిమజ్జనమయ్యేలా చర్యలు తీసుకున్నారు. అంతకు ముందు కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహారి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, కోశాధికారి సందడి మహేష్, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, మాజీ అధ్యక్షుడు సందడి సుధాకర్, నాయకులు గురుమూర్తి, భక్త బృందం వ్యవస్థాపకులు కల్యాణ్ కుమార్, సభ్యులు అశోక్, భరత్, సతీష్, ఆనంద్, చింటు, మహేష్‌కుమార్, నాగరాజు, ఉమన్న, శ్రీనివాసరెడ్డి, రాజ, తదితరులు నిమజ్జన పూజలో పాల్గొన్నారు. వినాయక లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా కాంచనం సురేష్‌బాబు (స్వస్తిక్ డెవలపర్స్) రూ.2 లక్షలకు కైవసం చేసుకున్నాడు. హుండీకి వేలం నిర్వహించగా రూ.1.45 లక్షలకు చింటూ, భరత్, వికాస్‌లు దక్కించుకున్నారు. నగర మేయర్ రామయ్య మాట్లాడుతూ కర్నూలు నగరంలో భారీ మట్టి గణనాథుడిని ఏర్పాటు చేసి ఇక్కడే నిమజ్జనం చేయడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావడం స్ఫూర్తి దాయకం అన్నారు. ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ భారీ మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసి 11 రోజుల పాటు పూజలు నిర్వహించి అక్కడే నిమజ్జనం చేయడం రాష్ట్రంలో ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. అంతకు ముందు చిన్నారులు ప్రదర్శించిన కోలాటం, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



భారీ గణనాథుడి వద్ద మేయర్ బీవై రామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్‌రెడ్డి, భక్తులు



నిమజ్జన కార్యక్రమానికి హాజరైన భక్తజనం



నీటితో మట్టి వినాయకుడిని తడుపుతున్న దృశ్యం



వేలం పాటలో దక్కించుకున్న లడ్డూతో భక్తులు

జిల్లా జడ్జికి ఫిర్యాదు

కర్నూలు (లీగల్) :డోన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మిశెట్టి ప్రసాద్‌పై డోన్ టౌన్ పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసుపై డోన్ న్యాయవాదులు మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధిని కలిసి ఫిర్యాదు చేశారు. ఓ సివిల్ కేసులో పిటిషనర్ తరపున వకాల్తా చేస్తున్న లక్ష్మీశెట్టి ప్రసాద్‌పై డోన్ సీఐ ఇంతియాజ్ బాషా 447, 427 సెక్షన్ల కింద న్యాయవాదిని, అతని కుమారుడిని, స్థల యజమానిని నిందితులుగా చేర్చినట్లు జిల్లా జడ్జికి వివరించారు. సమస్యను విన్న న్యాయమూర్తి తాను నంద్యాల ఎస్పీని పిలిపించి మాట్లాడి తగు చర్యలు తీసుకుని చట్ట ప్రకారం న్యాయం చేస్తామన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలసినవారిలో కర్నూలు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, మాజీ అధ్యక్షులు ఎం.సుబ్బయ్య, మోహన్‌రెడ్డి, తిరుపతయ్య, ఎం.వెంకటేశ్వర్లు, మంజునాథ్, డోన్ న్యాయవాదులు సంతోష్, కె.మహేష్, పులి దామోదరం, మల్లయ్య, హుసేన్, రవిమోహన్, వి.గజేంద్ర రావు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కర్నూలు : కల్లూరు మండలం దుర్గా హోటల్ వెనుక ఉన్న గణేష్ నగర్‌లో ఎరుకలి కుమార్, ప్రభాకర్ నాయుడు కలసి శేఖర్ గౌడ్ ఆటోలో మద్యం తాగుతున్నారు. తన ఆటోలో ఎందుకు మద్యం తాగుతున్నారంటూ శేఖర్ గౌడ్ వారిని నిలదీసినందుకు అతనిపై దాడి చేసి ఆటోను ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ కాలేజీలో హిందీ దివస్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో హిందీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హిందీ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఎం ఇందిరాశాంతి, ఉస్మానియా కాలేజీ హిందీ అధ్యాపకులు డా. షేక్ సలీంబాషా ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

సమస్త విశ్వం సృష్టికర్త విరాట్ విశ్వకర్మ భగవాన్

కర్నూలు(సెంట్రల్): సమస్త విశ్వం సృష్టికర్త విరాట్ విశ్వకర్మ భగవాన్ అని, ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీతోపాటు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ముఖ్య అతిథులుగా హాజరైన విశ్వకర్మభగవాన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతర ఎంపీ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా వెనుకబడిన కులాలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. జేసీ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ..విరాట్ విశ్వకర్మ భగవాన్ నైపుణ్యానికి, జ్ఞానానికి ప్రతీక అన్నారు. సృష్టి నిర్మాణంలో ఆయన పాత్ర కీలకమన్నారు. సమాజానికి అవసరమయ్యే వస్తువులను చేతి వృత్తుల ద్వారా ఎలా తయారు చేసుకోవాలో చేసి చూపించారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ , బీసీ సంక్షేమసంఘం నాయకులు ధనుంజయాచారి, కులమాల శ్రీనివాసాచారి, విజయాచారి, కల్లూరురాఘవాచారి, ఆదినారాయణాచారి, శ్రీనివాసులు, కుబేర స్వామి, బత్తుల లక్ష్మీకాంతయ్య, వెంకటేశ్వర్లు, మోహన్, కురువ రామకృష్ణ పాల్గొన్నారు.



విశ్వకర్మ ఊరేగింపులో మహిళలు, విశబ్రాహ్మణులు

ఘనంగా విశ్వకర్మ జయంతి

కర్నూలు(అర్బన్): దేవ శిల్పి విరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులు ఉదయం నుంచే పలు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు స్థానిక ఉల్చాల రోడ్డు సమీపంలోని వీరభద్ర స్వామి దేవాలయంలో గాయత్రీ విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు సోమయ్య ఆచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞ హోమం, పూజా కార్యక్రమాలు చేసి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ భగవాన్ చిత్రపటంతో వన్‌టౌన్ కాళికాదేవి దేవాలయం వరకు రథోత్సవ ఊరేగింపు నిర్వహించినట్లు అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి తెలిపారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు పార్వతమ్మ, కృష్ణవేణి, నాయకులు కొండయ్య ఆచారి, బ్రహ్మయ్య ఆచారి, రాజు ఆచారి, మల్లికార్జున ఆచారి, దుర్గయ్య ఆచారి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో రాయితీ భోజనం

- ప్రారంభించిన మార్కెట్ కమిటీ సెక్రటరీ
- రైతులు రూ.15 మాత్రమే చెల్లించాలి
- ఇస్కాన్ సౌజన్యంతో ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు ఏటా రాయితీపై అతి తక్కువ ధరకే భోజన సదుపాయం కల్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సారి కూడా ఈ సదుపాయాన్ని మార్కెట్ కమిటీ రైతులకు అందుబాటులోకి తెచ్చింది. మంగళవారం మార్కెట్ యార్డులోని భోజనశాలలో సెక్రటరీ గోవిందు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అతి తక్కువ ధరతో మంచి భోజనం పెట్టేందుకు మార్కెట్ కమిటీ ఒక భోజనంపై రూ.20 భరిస్తుందని, రైతులు రూ.15 మాత్రమే చెల్లించాలని సూచించారు. ఇస్కాన్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తెచ్చే రైతులకు ఇన్‌గేట్‌లోనే భోజనం టోకెన్ ఇస్తారన్నారు. 100 శాతం నాణ్యత, శుచి, శుభ్రతతో భోజనం ఉంటుందని, ఈ అవకాశాన్ని మార్కెట్‌కు వచ్చే రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డు పనిచేసిన అన్ని రోజుల్లో రాయితీ భోజనం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అసిస్టెంటు సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు సూపర్‌వైజర్లు, ఇస్కాన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డులో రాయితీ భోజన సదుపాయాన్ని ప్రారంభిస్తున్న సెక్రటరీ గోవిందు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



స్వచ్ఛతా హీ సేవ పోస్టర్ విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

కర్నూలు (టౌన్): పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి రాజ్ విహార్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. నగర మేయర్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. మన జిల్లాలో సెప్టెంబర్ 17 నుంచి వచ్చే నెల 2 వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ గతంలో నగరంలో 200 చెత్త కుండీలు ఉండేవని వాటిని పూర్తిగా తొలగించి పారిశుద్ధ్యంలో ఎన్నో మార్పులు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే నగరంలో 70 వేల మొక్కలు నాటామన్నారు. ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దన్నారు. అంతకు ముందు ఈ కార్యక్రమాన్ని జేసీ, ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. నగరపాలక ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వర రెడ్డి, ఎంఈలు షాకీర్, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, డీఎస్‌డీవో భూపతిరావు, మెప్మా పీడీ నాగ శివలీల, డీఆర్‌డీఏ పీడీ సలీం బాషా పాల్గొన్నారు.

ముఖ ద్వారం.. నిలువెత్తు 'స్వార్థం'!

కర్నూలు నడిబొడ్డున పెద్దాసుపత్రి సర్కిల్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఆసుపత్రికి ఎదురుగానే జిల్లా పరిపాలనకు కేంద్రమైన కలెక్టరేట్ ఉండటంతో అధికారులతో పాటు వివిధ పనుల నిమిత్తం జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల రాకపోకలు కూడా అధికమే. ఇలాంటి ప్రధాన కూడలిలోని ఆసుపత్రి ముఖద్వారం కొందరి స్వార్థానికి కొంతకాలంగా మూతపడింది. ప్రస్తుతం ఆసుపత్రిలోనికి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా ఒకే ద్వారం ఉపయోగపడుతోంది. ఈ కారణంగా అక్కడ రద్దీ నెలకొని రోగులతో పాటు సహాయకులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం ఆటో స్టాండ్‌గాను, పండ్ల విక్రయాలకు అడ్డాగా మారింది. అయితే ఈ ప్రధాన ద్వారం మూత వెనుక మెడికల్ దుకాణాల వ్యాపారం కూడా ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ఎవరి కమీషన్లు ఎంత అనే విషయం పక్కనపెడితే.. పోలీసులు కూడా ఈ విషయంలో ప్రేక్షకపాత్ర వహిస్తుండటం గమనార్హం. ఈ ప్రధాన ద్వారాన్ని అందుబాటులోకి తీసుకొస్తే అంబులెన్స్‌లు కూడా సకాలంలో ఆసుపత్రిలోనికి చేరుకునే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో ఇక్కడ ఆటోలను నిలుపకుండా.. పండ్ల విక్రయాలను నిలువరిస్తే ట్రాఫిక్ నియంత్రణ కూడా సాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పదోన్నతి పొందిన వీఆర్వోల ప్రొబేషన్‌ను డిక్లేర్ చేయండి

కర్నూలు(సెంట్రల్) : వీఆర్ఏ నుంచి వీఆర్వో గ్రేడు–2గా పదోన్నతి పొందిన వారి ప్రొబేషన్‌ను డిక్లరేషన్ చేయాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ జి.వెంకటరమణ అధికారులను కోరారు. మంగవారం సంఘం నాయకులు కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరిని కలసి సమస్యను ఆమె దృష్టికి తెచ్చారు. గతంలో జిల్లాలో 241 మంది గ్రామ రెవెన్యూ సహాయకులకు గ్రేడు–2 వీఆర్వోలుగా పదోన్నతి లభించిందన్నారు.తర్వాత వారికి సర్వే, సీపీటీ పరీక్షలు నిర్వహించి 196 మంది ప్రొబేషన్‌ను డిక్లరేషన్ చేశారని, అయితే సర్వే, సీపీటీ పరీక్ష ఉత్తీర్ణతను సాధించని 45 మంది ప్రొబేషన్ డిక్లరేషన్‌ను పెండింగ్‌లో ఉంచారన్నారు. కాగా, జీఓ నంబర్ 13 ప్రకారం ఆ పరీక్ష ఉత్తర్ణత సాధించకపోయినా ప్రొబేషన్‌ను డిక్లరేషన్ చేయాల్సి ఉందని ఆమెకు వివరించారు. అందుకు ఆమె స్పందించి విషయాన్ని కలెక్టర్, జేసీల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, దర్గాకుమార్, వీరస్వామినాయుడు, వీరేష్, సుభాన్ పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మను వివస్త్రను చేసి అవమానించి దాడి చేసిన సంఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల జ్యోతి తెలిపారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మహిళా నేత పులి కల్పనతో కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆమె మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జరిగిన సంఘటనకు సంబంధించి నివేదిక అందజేయాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని కమిషన్ ఆదేశించిందన్నారు. గోవిందమ్మపై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి బాధితులకు రక్షణ కల్పించాలన్నారు.

రేపు షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 19 వ తేదీ స్థానిక విఠల్ నగర్‌లోని గుడ్ షప్పర్డ్ ఇంగ్లిషు మీడియం స్కూల్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు.

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు

కర్నూలు కల్చరల్: దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక నరసింహారెడ్డి కాలనీలో ఘనంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. అశోక్‌నగర్, పాలకొట్టాల ప్రాంతాల్లో మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ దేశ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ సుపరిపాలన అందించడం మోదీకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, ఈరన్న, చిన్న ఉమన్న, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వేచ్ఛకై పోరాడిన పెరియార్



పెరియార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

కర్నూలు(అర్బన్): మహిళల స్వేచ్ఛ, హక్కుల కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహించిన ఉద్యమకారుడు పెరియార్ రామస్వామి అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. పెరియార్ రామస్వామి 145వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక వేదిక ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ పెరియార్ రామస్వామి కరుడుకట్టిన నాస్తికవాది అని, హిందు మతాన్ని, బ్రాహ్మణ వర్గాన్ని ఆయన తీవ్రంగా ద్వేషించారన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో కల్లు దుకాణాలకు వ్యతిరేకంగా తన సతీమణి నాగమ్మాయి, పెరియార్ సోదరి బాలాంబాల్ ముందుండి పోరాటాలు చేశారన్నారు. మహిళలను కూడా ఉద్యమంలో భాగస్వామ్యులను చేస్తూ ప్రోత్సహించారన్నారు. తమిళనాడులో ఆయన ఆత్మగౌరవ ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి ద్రవిడ ఉద్యమ నిర్మాత అయ్యారన్నారు. పెరియార్ గొప్ప సామాజిక విప్లవ కారుడన్నారు. ఆయన ఆలోచనా విధానాన్ని అనుసరిస్తూ ప్రతి ఒక్కరు మనుధర్మానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు.